క్లుప్తంగా

అప్రమత్తత అవసరం

ఖమ్మంగాంధీచౌక్: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ లింగస్వామి తెలిపారు. ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో 'సైబర్ మోసాలు–నివారణ'అంశంపై ఎస్‌బీఐ ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫేక్ కాల్స్‌కు స్పందించరాదని, సమాధానం ఇవ్వరాదని, ఎలాంటి సందేహం ఉన్నా సంబంధిత బ్యాంకు అధికారిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు ఇబ్రహీం, మధుబాబు, విద్యాసాగర్, వెంకటేష్, వెంకటేశ్వర్లు, బ్యాంకుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యాన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బీసీ దమాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపించాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు ఎ. వీరప్ప, శ్రీకాంత్, శంకర్ గౌడ్, గోపాలకృష్ణ, అరుణ, నాగమణి పాల్గొన్నారు.

నియామకం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ సీపీఎస్ ఈయూ) సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా చర్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా గుగులోతు మోహన్‌ను నియమితులైనట్లు రాష్ట్ర ఈసీ తెలిపింది. ఆదివారం ఈమేరకు నూతనంగా ఎన్నికైన సభ్యులకు సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రకంటి శశిధర్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పాత పెన్షన్ పునరుద్ధరణకు వెంటనే కార్యాచరణ చేపట్టాలన్నారు.

సహస్ర చండీ యాగం ప్రారంభం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని మమత రోడ్ ఫైవ్ ఎలిమెంట్స్ వద్ద ఆదివారం సహస్ర చండీ సహిత మహా రుద్ర యాగం ప్రారంభమైంది. శనివారంరాత్రి శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవాలయం నుంచి నగర సంకీర్తనను ప్రారంభించి గాంధీచౌక్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా హిమాలయాలు రుషికేష్ నుంచి వచ్చిన రుత్విక్కులు కలశ స్థాపన చేసి యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యాగ బ్రహ్మ రాజోలు భాను రవికిరణ్ శర్మ, యాగ కర్త దండ్యాల లక్ష్మణ్‌రావు, గుర్రం మురళి దంపతులు, యాగ సంకల్ప పిత సునీత మాత, వేంపటి సత్యనారాయణ దంపతులు కార్యక్రమాలను నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం..

నేలకొండపల్లి: మండలంలోని రాజారాంపేట సొసైటీ పరిధిలోని మంగాపురం తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ దీరావత్ బాలాజీ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. చెరువుమాదారం మత్స్య సొసైటీ ఉపాధ్యక్షుడు దీరావత్ రాధాకృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ భూక్య సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షతను వీడాలి

ఖమ్మం మామిళ్లగూడెం: కుల వివక్షతను విడనాడాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బానోత్ భద్రూ నాయక్ అన్నారు. ఆదివారం ఖమ్మం బీకే బజార్‌లోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం కరుణగిరి అపార్ట్‌మెంట్‌లో చోటు చేసుకున్న ఉదంతంపై కార్యాచరణ రూపొందించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరనారీమణుల ఆశయ సాధన జిల్లా అధ్యక్షురాలు ఉపేంద్రబాయి, ఉపాధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి చందు సహాయకార్యదర్శి విజయ, కార్యవర్గ సభ్యులు ప్రమీల, ఝాన్సీ, లలిత పాల్గొన్నారు.

ఎంపీ సంతాపం

ఖమ్మంమయూరిసెంటర్: ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య మృతికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సంతాపం తెలిపారు. నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి ఆయన ఎనలేని కృషి చేశారని సంతాప ప్రకటనలో చెప్పారు. మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మరో ప్రకటనలో ఊకే అబ్బయ్య మృతికి సంతాపం ప్రకటించారు.

30న సత్కారం

ఖమ్మం లీగల్: నగరంలో ఈ నెల 23న ఐఏఎల్ ఖమ్మం జిల్లా యూనిట్ ఆధ్వర్యాన నిర్వహించిన ఏఐబీఈ మాక్ టెస్ట్‌లో ఎం.లక్ష్మీప్రియ, సాయి శృతి, శ్రీలత, నవీన్, ప్రత్యూషాలు తమ సత్తా చాటారు. ఈమేరకు ఆదివారం యూనిట్ ఆధ్వర్యాన అభినందించారు. వీరిని ఈనెల 30న హన్మకొండలో జరిగే రెండో రాష్ట్ర మీటింగ్‌లో హైకోర్టు న్యాయమూర్తుల సమక్షంలో సత్కరిస్తారని యూనిట్ కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు తెలిపారు. పారుపల్లి అమరచంద్, స్పందన రెడ్డి, షేక్. నస్రీన్, మేకల నవీన్కుమార్, జీవీ లక్ష్మీనారాయణ, ముమ్మడి సతీష్, దామోదర్, గాజుల అమర్నాథ్, పురుషోత్తం, రమణ, శరత్బాబు, మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో మారిన లెక్కలు..

43వ డివిజన్‌లో అసెస్‌మెంట్ల లెక్కింపు పూర్తి

- 50 శాతం పెరుగుతున్న ఆదాయం
- అదనపు నిర్మాణాలు, పన్నుల రివైజ్డ్‌తో వెలుగులోకి..
- కేఎంసీ కమిషనర్‌కు నివేదిక అందజేసిన ఏజెన్సీ నిర్వాహకులు



ఖమ్మం నగరం వ్యూ

ఖమ్మంమయూరిసెంటర్: క్షేత్రస్థాయిలో కొంత మంది సిబ్బంది చేతివాటం, యజమానుల తప్పుడు లెక్కల కారణంగా నగరపాలక సంస్థకు ఆస్తి పన్నుల ద్వారా వచ్చే ఆదాయానికి భారీ గండి పడుతోంది. ఆస్తి పన్ను చెల్లింపు విషయంలో భవన యజమానులు కొంతమంది సిబ్బందితో కలిసి కుమ్మక్కై అధికారులను పక్కదారి పట్టించి పన్నులు తక్కువగా వచ్చేలా అసెస్‌మెంట్ల కొలతలను వేయించారు. మరికొంతమంది అనుమతులు లేకుండానే భవనాలు నిర్మించడం, అనుమతులు తీసుకున్న వాటికి అదనంగా నిర్మాణాలు చేపట్టి అసెస్‌మెంట్ లెక్కల్లో చూపించకుండా పన్ను ఎగవేస్తున్నారు. దీంతో కోట్లాది రూపాయల ఆదాయాన్ని కేఎంసీ కోల్పోతోంది. ఈ నేపథ్యాన నగరంలో ఉన్న ప్రస్తుత నిర్మాణాలు, యజమానులు తీసుకున్న అనుమతులకు సంబంధించి సర్వే నిర్వహించాలని కేఎంసీ అధికారులు నిర్ణయించారు.

పెరిగిన పన్ను..

ఏజెన్సీ నిర్వాహకులు 43వ డివిజన్‌లో చేసిన సర్వేతో పలు విషయాలు బయటకు వచ్చాయి. ఈ డివిజన్‌లో రెవెన్యూ విభాగం లెక్కల ప్రకారం ప్రస్తుతం ఆస్తి పన్ను చెల్లిస్తున్న అసెస్‌మెంట్లు సుమారు 500కు పైగా ఉండగా.. రూ.1.20 కోట్లు పన్ను కేఎంసీకి ఆదాయంగా వస్తుంది. ఏజెన్సీ నిర్వాహకులు సర్వే పూర్తి చేసిన తర్వాత వారి లెక్కల ప్రకారం 963 అసెస్‌మెంట్‌లు ఉన్నట్లు గుర్తించారు. ఉన్న భవనాలకు కొలతలు తక్కువగా వేయించినట్లు సర్వేలో నిర్ధారించినట్లు సమాచారం. ఏజెన్సీ బృందం అసెస్‌మెంట్లకు పన్నులు లెక్కించగా.. మొత్తం రూ.1.82 కోట్ల వరకు పన్ను పెరిగినట్లు తెలుస్తోంది. మొత్తంగా 50 శాతం పన్ను రివైజ్ అయినట్లు సమాచారం.

పైలెట్ ప్రాజెక్ట్‌గా 43వ డివిజన్..

నగరంలో కమర్షియల్ ప్రాంతంగా, అధిక భవన సముదాయాలు ఉన్న 11వ రెవెన్యూ వార్డులో గల 43వ డివిజన్‌ను ఎంపిక చేశారు. ఈ డివిజన్‌లో ఉన్న అసెస్‌మెంట్లను పైలెట్ ప్రాజెక్ట్ కింద పునఃపరిశీలన చేశారు. జియో ట్యాగింగ్ ద్వారా భవన సముదాయాల కొలతలను తీసుకోవడంతో పాటు ప్రస్తుతం ఆ భవనానికి వస్తున్న పన్ను తెలుసుకొని దాన్ని రివైజ్ చేస్తే ఎంత పెరుగుతుందనే లెక్కలు కట్టారు. ప్రతీ భవనానికి గూగుల్ మ్యాప్ ద్వారా పరిశీలించి, ప్రతీ ఇంటికి జియో ట్యాగింగ్ చేశారు. ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివరాలు, దానికి సంబంధించిన అనుమతులు, ప్రస్తుతం చెల్లిస్తున్న ఆస్తి పన్ను వివరాలను ఈ సర్వే ద్వారా సేకరించారు.

11వ రెవెన్యూ వార్డు మొత్తం సర్వే..?

నగరంలోని 11వ రెవెన్యూ వార్డులో 4–5 డివిజన్లు ఉండగా.. వాటిలో 43వ డివిజన్‌లో మాత్రమే పన్నుల లెక్కింపుపై సర్వే చేయించగా.. 50 శాతం వరకు పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతున్నట్లు గుర్తించారు. దీంతో రెవెన్యూ వార్డు మొత్తం సర్వే చేయిస్తే పూర్తి అవగాహన వస్తుందని అధికారులు భావించి కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

నోటీసులు.. అభ్యంతరాలు..

43వ డివిజన్‌లో ప్రైవేట్ ఏజెన్సీ బృందం చేపట్టిన సర్వేలో పలు భవనాలకు సంబంధించి కొలతలు సక్రమంగా లేకపోవడం, కొన్ని భవనాలు అనుమతులు లేకుండా, పన్నులు చెల్లించకుండా నిర్మాణాలు పూర్తి చేయడం వంటివి సర్వేలో గుర్తించారు. ఇక మరికొన్ని భవనాలకు రివైజ్ చేసిన పన్నుకు బదులు పాత కాలం నాటి పన్నులే విధిస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం చేపట్టిన సర్వేలో గుర్తించిన అంశాల వారీగా ఆయా భవనాల యజమానులకు కేఎంసీ అధికారులు నోటీసులు ఇచ్చి కేఎంసీలో యజమానుల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. మరోసారి ఆయా ప్రాంతాల్లో కేఎంసీ సిబ్బంది భవనాలకు కొలతలు వేసి పన్నులను పరిశీలించనున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా.. ఏజెన్సీ బృందం సర్వే పూర్తి చేసి పూర్తి నివేదికను కేఎంసీ కమిషనర్‌కు అందజేశారు. వారి నివేదికను పరిశీలించి భవన యజమానులకు నోటీసులు జారీ చేస్తామని, కేఎంసీ రెవెన్యూలో అసెస్‌మెంట్ నంబర్ లేకుండా ఉన్న భవనాలకు ఫైన్ వేయడం జరుగుతుందని చెప్పారు.

ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేస్తాం



మంత్రి పొంగులేటిని కలిసిన యూనియన్లు, సొసైటీ బాధ్యులు, సభ్యులు



మంత్రి తుమ్మలతో..

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం నియోజకవర్గంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలను అందించే ప్రక్రియను వేగవంతం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన మూడు జర్నలిస్ట్ యూనియన్లు టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్), టీడబ్ల్యూజేఎఫ్(ఫెడరేషన్) ఆధ్వర్యంలో స్తంభాద్రి జర్నలిస్ట్ హౌజింగ్ సొసైటీ నూతన పాలకవర్గ సభ్యులు ఆదివారం ఇద్దరు మంత్రులను కలిశారు. ఈ మేరకు ఇళ్ల స్థలాలను వీలైనంత త్వరగా అందించేలా చూస్తామని మంత్రులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి కె.రాంనారాయణ, జిల్లా శాఖ అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, కార్యదర్శి చిర్రా రవి, నాయకులు గుద్దేటి రమేష్‌బాబు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాము, స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు, కోశాధికారి వెన్నబోయిన సాంబశివరావు, ఉపాధ్యక్షుడు మైసా పాపారావు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

దేవాలయాలకు మంత్రి పొంగులేటి వితరణ



విరాళం అందిస్తున్న దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి: రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పలు ప్రార్థన మందిరాల నిర్మాణాలకు ఆదివారం క్యాంపు కార్యాలయంలో కార్యాలయఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి విరాళాలు అందజేశారు. భైరవునిపల్లి గ్రామంలో కాటమయ్య దేవాలయానికి రూ.2 లక్షలు, బంగారు మైసమ్మ దేవాలయానికి రూ.50వేలు, గువ్వలగూడెం గ్రామంలోని గంగమ్మ తల్లి దేవాలయానికి రూ.50వేలు, మసీదు నిర్మాణానికి రూ.50వేలను అందించారు. అలాగే నేలకొండపల్లి గ్రామంలోని కాటమయ్య ఆలయానికి రూ.లక్ష, మంగాపురంతండా సేవాలాల్ గుడికి రూ.లక్ష ఆయా కమిటీల బాధ్యులు, నాయకులకు అందజేశారు.

పొంగులేటి పరామర్శ..

ఖమ్మంవన్‌టౌన్: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యక్తిగత సహాయకుడు కొమరగిరి రాఘవరావు తండ్రి రంగారావు ఇటీవల అనారోగ్యంతో మరణించగా.. ఆదివారం మంత్రి పొంగులేటి పరామర్శించి, చిత్రపటానికి నివాళులర్పించారు. ఆత్మకు శాంతి కలగాలని దేవున్ని ప్రార్థించారు.

ఆన్‌లైన్ నమోదు పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సేకరించిన సమాచారాన్ని తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. ఆదివారం కేఎంసీ కార్యాలయంలో డేటా ఎంట్రీని ఆయన పరిశీలించి మాట్లాడారు. నగరంలో 60 శాతంకు పైగా కుటుంబ సర్వే పూర్తయిందని, రెండు రోజులుగా సర్వే పూర్తయిన ఈబీల డేటాను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, సూపర్‌వైజర్లు ఈ ప్రక్రియను పరిశీలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ జి.శ్రీనివాసరావు, ఆర్‌ఐలు విజయానంద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి కట్టుబడి ఉండాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఏఐసీసీ, ముఖ్యమంత్రి నిర్ణయాలను వ్యతిరేకించే ఎమ్మెల్యేలను పార్టీ నుంచి బహిష్కరించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పడమర్తి రవి, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత కొన్నిరోజులుగా మాదిగ జాతి ఓట్లతో గెలిచిన చెన్నూరు, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు వివేక్, నాగరాజులు సుప్రీంకోర్టు తీర్పుతో పాటు పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పాల్పడుతున్నారని ఆరోపించారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇస్తే ఏబీసీడీ వర్గీకరణ అవుతుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మట్టె గురుమూర్తి, తోళ్ల రాకేష్, కష్టాల క్రాంతి, దూడ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి జీపీలోని అబ్బాసుపురంకు చెందిన ధరావత్ కృష్ణప్రసాద్ స్థానిక హైస్కూల్‌లో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివారు. ఇటీవల కృష్ణప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందాడన్న విషయం తెలుసుకుని మిత్రులు ఆదివారం వారి వంతు సాయంగా రూ.10 వేలు అందజేసి మిత్రుడి చిత్రపటానికి నివాళులర్పించారు. మిత్రులు భూక్యా నాగేంద్రబాబు, కానుగుల సత్యనారాయణ, ధరావత్ విన్నిబాబు, రాము, లావుడియా వీరభద్రం, శ్రీరామ్ సతీష్, పందుల వెంకటేశ్వర్లు, గుగులోత్ ఉపేందర్, అంబడిపూడి రాజేష్, బానోత్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీవనభృతి అమలు చేయాలి

తిరుమలాయపాలెం: వ్యవసాయ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హన్మంతరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బచ్చోడులో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయమై డిసెంబర్ 2న చలో కలెక్టర్ ముట్టడికి తరలి రావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు గొర్రెపాటి రామచంద్రు, తిమ్మిడి రఘుబాబు, నందిపాటి వెంకన్న, నందిపాటి లచ్చయ్య, గొర్రెపాటి సాలయ్య, ఉప్పయ్య, గొర్రెపాటి వెంకన్న, లచ్చయ్య, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ సబ్ జూనియర్ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల అథ్లెటిక్స్ జట్లను ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 56 మంది క్రీడాకారులు పాల్గొనగా.. ఎంపికైన వారిలో అండర్–8 బాలురలో ఎం.వివేక్, ఈ.భవన్‌తేజ, బాలికలలో సీహెచ్.లాస్యశ్రీ, జె.సాత్విక, అండర్–10 బాలురలో రోహిత్, పి.అలోక్, సీహెచ్.జీవన్, టి. కృష్ణ, బాలికలలో ఎం.భవిత, డి.లోహిత, టి.నిత్యశ్రీ, అండర్–12 బాలురలో ఈ.వరుణ్, శ్రీసాయి ఆదర్శ్, బాలికలలో హస్మిత, ప్రతిభలు ఉన్నారు. వీరు త్వరలో మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా సంఘం కార్యదర్శి ఎండీ. షఫీక్‌అహ్మద్ తెలిపారు. ఎంపికల ప్రక్రియలో సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎండీ. గౌస్, సభ్యులు ఎం.సుధాకర్, రవి, నవీద్, హాలీం తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో సత్తా చాటిన నగీన



రజత పతకం సాధించిన నగీన (ఎడమ వైపు చివర)

ఖమ్మం స్పోర్ట్స్: తమిళనాడు రాష్ట్రం సేలంలో జరిగిన దక్షిణ భారత దేశ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఖమ్మానికి చెందిన సీహెచ్.నగీన ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది. మహిళల విభాగంలో జరిగిన ఈ పోటీల్లో ఓవరాల్‌గా 362.5 కేజీల బరువులు ఎత్తి తర్వాత జరిగే ఇంటర్ జోనల్ పోటీలకు అర్హతను సాధించింది. జిల్లా నుంచి జాతీయ స్థాయి పతకం సాధించడం పట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్.మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

నవోదయలో ఘనంగా ఎన్‌సీసీ వేడుకలు



వేడుకలో పాల్గొన్న కేడెట్లతో ప్రిన్సిపాల్

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం ఎన్‌సీసీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఎన్‌సీసీ పతాకావిష్కరణ చేసి కేడెట్ల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కేడెట్లు ప్రతిజ్ఞ నిర్వహించి పలు అంశాలను ప్రదర్శించారు. కాగా, సమాజ సేవలో ముందుంటూ భావి భారత పౌరులుగా గుర్తింపు పొందాలని ప్రిన్సిపాల్ కేడెట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకుడు జి.వెంకట్రావు, ఎన్‌సీసీ అధికారి కె.లక్ష్మీప్రసాద్, కేర్ టేకర్ నరేష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సందడిగా కార్తీక వనసమారాధనలు

ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి: మంత్రి తుమ్మల



కమ్మ వనసమారాధనలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: అన్ని రంగాల్లో ఐక్యంగా ఉంటేనే కమ్మ సంఘం అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలోని వెలుగుమట్ల అటవీపార్కులో కమ్మ జన మహా సంఘం జిల్లా అధ్యక్షుడు యర్నేని రామారావు అధ్యక్షతన నిర్వహించిన కమ్మ వన సమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. కమ్మ వారు వృత్తిపరంగా వ్యవసాయమే అయినా కాలానుగుణంగా మార్పులు చోటు చేసుకుంటూ అందరిలో ఒకడిగా బతుకుతున్నారన్నారు. భవిష్యత్‌లో జాతి గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, కులంలో ఉన్న పేదల కోసం సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ చిత్ర ఫొటో ప్రదర్శన, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దేవాలయ సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి. అనంతరం క్రీడా పోటీలు నిర్వహించి, బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు, మేయర్ పునుకొల్లు నీరజ, తెలంగాణ గెజిటెడ్ సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర ఇరిగేషన్ సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లుతో పాటు డాక్టర్ రామనాథం, రావూరి కరుణసైదుబాబు, గుడివర్తి నాగేశ్వరరావు, చంద్ర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో కేశ్వాపురంవాసుల వన భోజనాలు



వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న కేశ్వాపురం గ్రామస్తులు

కూసుమంచి: మండలంలోని కేశ్వాపురం గ్రామానికి చెందిన 75 కుటుంబాలకు చెందిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు ఉద్యోగ, వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటుండగా వారందరూ ఆదివారం ఒకే చోటుకు చేరారు. రాజధానిలోని ఆదిభట్లలో నిర్వహించిన వన భోజన కార్యక్రమంలో వారు పాల్గొని ఆనందంగా గడిపి గ్రామాభివృద్ధికి పాటుపడాలని నిర్ణయించుకున్నారు.


ఆర్యవైశ్యుల వన సమారాధన..



వనసమారాధనలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని చెరుకూరి మామిడి తోటలో ఆదివారం జరిగిన ఆర్యవైశ్యుల వన సమారాధన కార్యక్రమం గోపూజతో ప్రారంభించారు. అనంతరం సామూహిక సత్యనారాయణవ్రతాలను ఆచరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక క్రీడల్లో బహుమతులు పొందిన వారికి లక్కీ డిప్ ద్వారా ప్రతీ అరగంటకు ఒక గిఫ్ట్ అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పాల్గొనగా, వారిని ఆర్యవైశ్య ప్రతినిధులు శాలువాతో సత్కరించి మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ఆహ్వాన కమిటీ ప్రతినిధులు చిన్ని కృష్ణారావు, మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, సోమ నరసింహారావు, తల్లాడ రమేష్, గుమ్మడివెల్లి శ్రీనివాస్, గోళ్ల రాధాకృష్ణ, రాయపూడి రవికుమార్, కలువకుంట్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత ద్వారానే రాజ్యాధికారం: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



అభివాదం చేస్తున్న ప్రభుత్వం విప్, యాదవ నేతలు

ఖమ్మంఅర్బన్: యాదవ, కురుమల ఐక్యత ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని చెరుకూరి మామిడితోటలో అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యాన యాదవ వనమహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో అతి తక్కువ జనాభా కలిగిన అగ్రవర్ణాల వారు పదవులు అనుభవిస్తున్నారే తప్ప అత్యధిక జనాభా గలిగిన గొల్ల కురుమలకు రాజకీయంగా ప్రాతినిధ్యం కలగడం లేదన్నారు. ప్రతీ గొల్ల కురుమ పార్టీలకతీతంగా, రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉండి మన హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత జిల్లా యాదవ మహాసభ గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనరసయ్య, యాదవ యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రితో పాటు సంపత్, సంగారెడ్డి సుందర్ రాజు, గొర్ల యశ్వంత్, పుచ్చకాయల వీరభద్రం, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

మీ సహకారంతోనే ఉన్నత స్థాయికి: మంత్రి పొంగులేటి



ఖమ్మంగాంధీచౌక్: కుమ్మరుల ఆరాధ్య దైవానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంఅర్బన్/ఖమ్మం గాంధీచౌక్: ప్రజలందరి సహకారంతోనే తాను ఉన్నత స్థాయికి ఎదుగుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం బల్లేపల్లిలోని మలీదు జగన్ మామిడి తోటలో శ్రీమొల్లమాంబ కుమ్మర సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన వనసమారాధనలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయాన అన్ని వర్గాల లాగానే కుమ్మర కులస్తులు ఏకతాటిపై నిలిచి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేసిందని కొనియాడారు. కుమ్మరుల న్యాయపరమైన సమస్యలన్నంటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సైదులు, చంద్రశేఖర్, జనార్దన్, శ్రీనివాసరావు, భిక్షమయ్య, వీరబాబు, రాధాకృష్ణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెంలో బంజారాలు..



మంత్రి పొంగులేటిని సన్మానిస్తున్న గిరిజనులు

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని మామిడి తోటలో ఆదివారం ఖమ్మం పట్టణానికి చెందిన లంబాడ(బంజారా) కులస్తులు కార్తీక వనసమారాధాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఖమ్మం ఎంపీ రఘురామ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులను వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాండురంగాపురం సేవాలాల్ దేవాలయం కమిటీ అధ్యక్షుడు మూడ్ బాల్‌సింగ్, కుల పెద్ద చక్రవర్తి నాయక్, మంగీలాల్ జాదవ్, కన్వీనర్ రాము తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



తిరుమలాయపాలెం: పూజలు చేస్తున్న మహిళలు

కూసుమంచి/తిరుమలాయపాలెం: ఆర్యవైశ్యుల వన సమారాధన కార్యక్రమాలను ఆదివారం కూసుమంచి, తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశాక ఆనందంగా గడిపారు.

మున్నూరు కాపుల వనసమారాధన..



గుండాల కృష్ణను సత్కరిస్తున్న మున్నూరుకాపులు

ఖమ్మం మామిళ్లగూడెం: మున్నూరు కాపులు సమస్యల సాధనకై సంఘటితంగా ముందుకు సాగాలని ఖమ్మం మాజీ మార్కెటింగ్ చైర్మేన్ గుండాల కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన మున్నూరు కాపు వనసమారాధనలో ఆయన మాట్లాడారు. సామజికంగా ఎదిగేందుకు రాజకీయంగా రాణించాలని సూచించారు. దీని కోసం రానున్న పంచాయతీ ఎన్నికల్లో మున్నూరు కాపులను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో పాటు మున్నూరు కాపు పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలు, కులాలకతీతంగా..



ఖమ్మంరూరల్: తీర్థాల వనసమారాధనలో..

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: నేలకొండపల్లి మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో, ఖమ్మంరూరల్ మండలంలోని తీర్థాల, గోళ్లపాడు, వెంకటగిరి, గుర్రాలపాడు ప్రాంతాల్లోని మామిడి తోటల్లో ఆదివారం రాజకీయాలకు అతీతంగా, అన్ని సామాజిక వర్గాల వారు వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేయగా.. పెద్దలు, పిల్లలు ఆటపాటలతో సందడి చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.